ప్రగతి కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



కూకట్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ నిజామాబాద్ రెండవ స్నాతకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రగతి కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు దేవ శ్రీనివాస్ అర్థశాస్త్రములో డాక్టరేట్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రొఫెసర్ కొండా రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో దేవ శ్రీనివాస్ 'వర్కింగ్ ఆఫ్ ప్రైమినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ఇన్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ ఇన్ అనాలిటికల్ స్టడీస్' అనే అంశంపై పరిశోధనను పూర్తి చేశారు. పలువురు అధ్యాపకులు ఆయనను సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో బుధవారం ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, షేక్ రఫీక్, వెంకటేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీకి సన్మానం

మూసాపేట: మూసాపేట సర్కిల్ డీసీగా బాధ్యతలు చేపట్టిన ఇస్లావత్ నాయక్‌ను బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు, జగన్, కూతాడి కృష్ణ, యాసిన్, కర్క మహేష్, పాషా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సర్‌కు సన్మానం



కూకట్‌పల్లి: థాయ్ బాక్సింగ్, తైక్వాండో, కిక్ బాక్సింగ్ వంటి స్పోర్ట్స్‌లో అంతర్జాతీయంగా పాల్గొని బంగారు పతకాలను ప్రముఖ కిక్ బాక్సర్ ప్రతిభ తక్కడపల్లి సాధించింది. బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌ను ఆయన కార్యాలయంలో కలవడంతో ఆయన సన్మానించారు. ప్రతిభ అక్టోబర్ నెలలో సెర్బియాలో జరగనున్న పోటీలకు అర్హత సాధించినందుకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని బీజేపీ నాయకులు ఎనుగుల తిరుపతి యాదవ్ అన్నారు. బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లో పర్యటించారు. డ్రైనేజీ, వాటర్ సమస్య, వీధి దీపాలు తదితర సమస్యలను పలువురు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా దేవాలయప్రాంగణంలో బస్తీ దవాఖాన ఉండటంతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ స్థలం ఉంటే ఎంపీ రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి బస్తీ దవాఖానను అక్కడకు మార్చేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్‌గౌడ్, అమర్, మక్కాల నర్సింగ్, మక్కాల అశోక్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

హల్దీరాం గోదాంలో అగ్ని ప్రమాదం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్, పాపిరెడ్డినగర్ సి బ్లాక్ రోడ్డు నెంబర్ 8లోని హల్దీరాం గోదాంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీనిని గుర్తించిన స్థానికులు పోలీస్, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల వారు భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు ఆలయాలు ముస్తాబు

- నేడు అమ్మవార్ల బోనాల వేడుకలు
- విద్యుత్ దీపాలతో ఆలయాల అలంకరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రతినిధులు



విద్యుత్ కాంతులతో భవానీ నగర్‌లోని అమ్మవారి ఆలయం



మూసాపేట: మూసాపేటలో ఆషాడమాస బోనాల ఉత్సవాలకు ఆయా ఆలయ నిర్వాహకులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో విద్యుత్ దీపాలంకరణతో, రంగులతో, పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామంలో గురువారం బోనాల పండుగ నిర్వహించనున్నారు. మొక్కులుగా బోనాలు సమర్పించే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుమారు 100 సంవత్సరాలకు క్రితం గ్రామ దేవతలుగా మూసాపేట గ్రామంలో అమ్మవార్లు వెలిశారని పెద్దలు చెబుతుంటారు. గ్రామంలో రోగాలు ప్రబలుతున్నప్పుడు గ్రామ పెద్దలు కలిసి గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి, మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహంకాళి అమ్మవారు, గూడ్స్ షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ తల్లి, మూసాపేటలోని ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ తల్లి, గ్రామ దేవతలుగా ఆనాటి నుంచి నేటి వరకు పూజలు అందుకుంటున్నారు. నగరంలోని బోనాల పండుగకు ముందే ఇక్కడి గ్రామ దేవతలకు బోనాల మొక్కులను సమర్పించుకుంటారు. వారం ముందే గ్రామ బొడ్రాయికి పూజలు చేసిన అనంతరం గురువారం రోజు గ్రామ దేవతలకు బోనాలు, ఆదివారం చిత్తారమ్మ తల్లి జాతరను నిర్వహించటం ఇక్కడ అనాదిగా వస్తుంది.

మొదటి పూజ పోచమ్మతల్లికి

మూసాపేట భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లిని కొన్ని సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. విష జ్వరాలు ప్రబలటంతో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఇక్కడి అమ్మవారిని శీతలిమాతగా కొలుస్తారు. తట్టు, పొంగు వంటి విష జ్వరాలు వచ్చినప్పుడు కాలనీ వాసులే కాక చుట్టు పక్కల ప్రజలు కూడా అమ్మవారికి పూజలు నిర్వహిస్తుంటారు. గురువారం నిర్వహించే బోనాల వేడుకల్లో మొదటి పూజను పోచమ్మ తల్లికి నిర్వహించిన తరువాతనే మిగతా ఆలయాల్లో నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. ఎవరి ఇంట కల్యాణం జరిగినా పెండ్లి చీరను అమ్మవారి ముందు ఉంచి పూజలు చేసి తీసుకెళ్తారు.

నాగలితో దున్నుతుండగా..

మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద వందల సంవత్సరాల క్రితం మహంకాళి, సరస్వతి అమ్మవార్ల ఆలయం ఉంది. సుమారు శతాబ్దం క్రితం ఆలయం ఉన్న ప్రాంతమంతా పంట పొలాలతో ఉండేది. రైతులు నాగలితో పొలం దున్నుతుండగా మహంకాళి అమ్మవారి విగ్రహం నాగలికి తగిలింది. దీంతో అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీసి అదే ప్రాంతంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. కాలక్రమేణా అమ్మవారికి ఆలయం కట్టించి సరస్వతి అమ్మవారిని కూడా ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.

పుట్టలో ముత్యాలమ్మ తల్లి..

పూర్వం పూజలు అందుకున్న ముత్యాలమ్మ తల్లి కాలక్రమేణా పుట్టలోకి పూర్తిగా వెళ్లిపోయింది. కొన్ని సంవత్సరాల తరువాత గ్రామ పెద్దకు కలలో అమ్మవారు కనిపించి రావి చెట్టు కింద పుట్టలో ఉన్నానని, తనకు ఆలయం నిర్మించాలని ఆదేశించింది. అప్పటి గ్రామ పెద్దలు ఆలయాన్ని నిర్మించారు. తిరిగి 2008లో ఆలయాన్ని పునర్నిర్మించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



విద్యుత్ కాంతులతో నల్లపోచమ్మ ఆలయం

కోరికలు తీర్చే నల్ల పోచమ్మ..

మూసాపేట జాతీయ రహదారిపై నల్లపోచమ్మ తల్లి ఆలయం ఎన్నో సంవత్సరాల నుంచి పూజలు అందుకుంటున్నది. కొన్ని సంవత్సరాల తరువాత ఆలయం శిథిలావస్థకు చేరుకోవటంతో 1996లో అదే స్థలంలో పున ప్రతిష్ఠించారు. మూసాపేట గ్రామ ప్రజలు ఏ ఊరుకెళ్లినా అమ్మవారిని దర్శించుకొని వెళ్తుంటారు.

నేడు పోచమ్మ బోనాలు

ఏర్పాట్లు చేసిన ఆలయ ప్రతినిధులు

కూకట్‌పల్లి: పోచమ్మ తల్లి బోనాలను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పర్యవేక్షకుడు మాధవరం రామచంద్రరావు తెలిపారు. 400 సంవత్సరాల క్రితం పంట పొలాల్లో స్వయంభుగా వెలసిందని పెద్దలు తెలిపారు. మొదటి ఆలయం చిన్నగా ఉండేది. ప్రతి ఏటా ఆలయాన్ని అభివృద్ధి చేశారు. రైతుల పశు సంపదకు ఎంతగానో అండగా నిలిచిందని ఇక్కడ రైతుల నమ్మకం. 2023 సంవత్సరంలో ఆలయాన్ని పున ప్రతిష్ఠ చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లిలోని సప్త మాతృక సైత పోచమ్మ దేవాలయంలో ఏడుగురు అమ్మవార్లు ఉన్నారు. పోచమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, ఈదులమ్మ తల్లులు. ఈ చిత్తారమ్మ దేవాలయం కంటే ముందే గురువారం రోజు ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇక్కడ వందల సంఖ్యలో మహిళలు బోనాలను సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. నల్ల చెరువు సమీపంలో ఉన్న ఈ దేవాలయం ప్రతి ఏటా ఎంతో అభివృద్ధి చెంది భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తోంది. ప్రధాన అర్చకులుగా బద్రి ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అనేక సంవత్సరాలుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు బోనాల ఉత్సవాలు కూడా ఘనంగా నిర్వహించటం జరుగుతున్నది.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దని వినతి

మోతీనగర్: ప్రస్తుతం భూమి, ఇండ్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే కొనుగోలుదారులు ఆసక్తి చూపరని, చార్జీలు పెంచొద్దని వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌గాంధీ మనుమంత్‌ని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యవస్థ మళ్లీ పుంజుకోవాలి అంటే ప్రస్తుతం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచవద్దన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు విజయసాయి, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లయన్ కిరణ్, తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, బిల్డర్స్ పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి విద్యార్థి సంఘాల వినతి

బాలానగర్: జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాల ప్రతినిధి బృందం బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విభాగంలోని పరిస్థితులు, విద్యార్థుల సమస్యలు వివరించారు. జేఎన్‌టీయూహెచ్‌లోని చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు మరో ఇద్దరు డైరెక్టర్లు చేస్తున్న అవినీతి, తప్పుదారి చర్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కొరత, పరీక్షల షెడ్యూల్‌లో జాప్యం, అవినీతితో కూడిన ఆర్థిక లావాదేవీలపై విద్యార్థుల ఆందోళనను వివరించారు. కార్యక్రమంలో డా. శాడగొండ కరుణాకర్‌రెడ్డి, బోయపల్లి అశోక్ గౌడ్, తేజ, జవ్వాజి దిలీప్, భానుప్రకాష్ నాయక్ లకావత్, రాహుల్‌నాయక్, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- చిత్తారమ్మ బోనాల ఏర్పాట్లపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌లు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బోనాల జాతర పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులతో చిత్తారమ్మ అమ్మవారి ఆషాఢ బోనాల ఏర్పాట్లపై ఆలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం బోనాల జాతర సందర్భంగా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. వేలాదిగా భక్తులు తరలి రానుండటంతో ఆలయ ప్రాంగణంలో తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానందనగర్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్, ఎండోమెంట్ అధికారులు, మాజీ చైర్మన్లు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మూసాపేట: రాఘవేంద్రనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు హబీబ్‌నగర్, ఆంజనేయనగర్, ఐడీఎల్ చెరువు, మూసాపేట ప్రధాన రహదారి ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలాజీనగర్, సాయిబాబా దేవాలయం, రాందేవ్‌రావ్ ఆసుపత్రి, న్యూ బాలాజీనగర్, వైఎస్‌ఆర్ విగ్రహం ప్రాంతం, వివేక్‌నగర్ రోడ్డు నంబర్ 1, 3, 4 ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బోనాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం నిర్వహించే బోనాల పండుగ వాల్‌పోస్టర్‌ను బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. అంజయ్యనగర్‌లోని మక్కాల నర్సింగ్‌రావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్యమూర్తి, వేణుగోపాల్‌రెడ్డి, జగదీష్‌బాబు, మక్కాల నర్సింగ్‌రావు, గణేష్‌గుప్తా పాల్గొన్నారు.

కల్లు కంపౌండ్లపై దాడులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: కల్లు కంపౌండ్లపై ఎస్టీఎఫ్ టీమ్‌లు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశాయి. ఇటీవల కల్తీకల్లు అమ్మకాలు, అనుమతిలేని కల్లు డిపోల నిర్వహణ, అనుమతి లేకుండా కల్లు రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనతో హైదరాబాద్ సహా నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా 'ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్' కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం కల్లు కాంపౌండ్‌లను తనిఖీ చేశారు. బుధవారం దూల్‌పేట్‌లో ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి అధ్వర్యంలో మూడు చోట్ల దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు.

◆ దూల్‌పేట్, మల్లాకుంట ప్రాంతంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 70లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్లు శాంపిల్ తీసుకుని మిగిలిన దానిని పారబోశారు. ఈ కేసులోని నిందితుడిని అదుపులోకి తీసుకుని, మరొకరిపై కూడా కేసు నమోదు చేశారు. - దూల్‌పేట్‌లోని మంగళ్‌హట్ ప్రాంతంలో 247 లీటర్ల కల్లుకు అనుమతిలేకపోవడంతో పారబోసి, ఒకరిని అరెస్టు చేసి మరొకరిపై కేసు నమోదు చేశారు.

◆ గుడిమల్కాపూర్ హీరానగర్‌లో అనుమతిలేని కల్లు డిపోలోని 382 లీటర్ల కల్లును పారబోశారు. గోదా రాఘవేందర్‌గౌడ్‌ను అరెస్టు చేసి, రామకృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. మరో రెండు కేసుల్లో ఎస్టీఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నాగరాజు అధ్వర్యంలో శేరిలింగంపల్లిలో కల్లు డిపోలపై దాడులు నిర్వహించి శాంపిల్స్‌ను సేకరించారు. హైదర్‌నగర్, రంగారెడ్డినగర్, తర్కముల్ ప్రాంతాల్లోని కల్లు డిపోల్లో దాడులు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు.

సిబ్బంది పనితీరు పరిశీలన



డీసీని సన్మానిస్తున్న కాలనీవాసులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్‌లో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఎంటమాలజీ సిబ్బంది పనితీరును జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్ బుధవారం పరిశీలించారు. ఉదయాన్నే ఎవరికీ సమాచారం ఇవ్వకుండా సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారా?, లేదా? అనే అంశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వస్తుండటంతో సిబ్బంది సైతం అప్రమత్తం అవుతున్నారు. బుధవారం కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో ఎంటమాలజీ సిబ్బందితో కలిసి కాలనీ వాసులతో మాట్లాడారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీ వాసులు ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లలో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, చెత్తా చెదారాలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎంటమాలజీ సిబ్బంది దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలు పిచికారీ చేయాలని సూచించారు.

ఉప కమిషనర్‌కు సన్మానం

కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని కాలనీ వాసులు ఆర్. ప్రతాప్, అంజిబాబు, నరసింహులు, హరిబాబు, లక్ష్మీ నారాయణ తదితరులు డీసీ సేవా ఇస్లావత్‌ను కోరారు. వీధి దీపాల సమస్య, రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చటం, తదితర సమస్యలను పరిష్కరించడంతో కాలనీవాసులు ఆయనను సన్మానించారు.

శ్మశాన వాటిక పనులు ప్రారంభం

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని పార్థి బస్తీలో రూ.93 లక్షల నిధులతో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో శ్మశాన వాటిక పనులను బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు నాలా పక్కన ఉండటం వల్ల శ్మశాన వాటికలో నీళ్లు వచ్చి ఇబ్బందులు పడేవారన్నారు. రిటర్నింగ్ వాల్ కట్టడం వల్ల ఆ సమస్య తీరిందన్నారు. కార్యక్రమంలో నాగరాజ్, జయమ్మ, బబ్లు, శోభన్, సురేందర్‌నాయుడు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్ తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెరువులో ఆయిల్ బాల్స్‌ను వేయిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని ఆయన దృష్టికి తీసుకురాగా.. బుధవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణకు ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్‌ను చెరువులో వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆయిల్ బాల్స్‌ను చెరువులో వేయటం వల్ల లార్వా దశలోనే దోమలు చనిపోతాయని, దోమల వృద్ధి జరగకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, ఎంటమాలజీ సూపర్ వైజర్ డి. నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్



చెక్కులు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. ఫతేనగర్, బాలానగర్‌కు చెందిన నలుగురికి రూ. 2.20 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి తోడ్పాటును అందిస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రమేష్, కిట్టు, హమీద్, ఆయాజ్, రాజీపటేల్, రవీందర్, ఆసీఫ్, సలీం పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి తుల్జారామ్, పాఠశాల డీన్ శిరీష, విద్యార్థులు

కూకట్‌పల్లి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎన్‌సీసీ అధికారి తుల్జారామ్ అన్నారు. కేపీహెచ్‌బీలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం విద్యార్థుల నాయకత్వ లక్షణాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల్లో నాయకులుగా ఎన్నికైన వారికి పతకాలు అందజేశారు. అనంతరం విద్యార్థుల నాయకుడి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ శిరీష, అకాడమిక్ ఇన్‌చార్జి సౌమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లపై సమీక్ష

బాలానగర్: బోనాల పండుగ సందర్భంగా బుధవారం అన్ని విభాగాల అధికారులతో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఎప్పటికప్పుడు అధికారులు మానిటరింగ్ చేయాలని తెలిపారు. ఎలక్ట్రికల్ సిబ్బందికి సూచిస్తూ ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అవసరం ఉన్న చోట భక్తులు ప్రదర్శన చేయడానికి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాల చుట్టూ లైట్లు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ సిబ్బంది దేవాలయాల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ గుడిమెళ్ల ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ మధు, శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్ రెడ్డి, నర్సింగ్‌రావు, వీధిలైట్లు సిబ్బంది యాదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, అధికారులు

92 ఆలయాలకు రూ.30.61 లక్షల చెక్కులు



ప్రతినిధులకు అందజేసిన పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు వీలుగా ప్రభుత్వం 92 దేవాలయాలకు రూ.30.61 లక్షల చెక్కులను మంజూరు చేసింది. బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డిలతో కలిసి దేవాలయాల కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాడవాడల బోనాల వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, దేవాలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.